## ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు అనుమతించాలి

- టీటీడీకి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సూచన



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శ్రీవారి దర్శనానికి తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పంపుతున్న సిఫార్సు లెటర్లను ఫిబ్రవరి 1 నుంచి అనుమతిస్తామని బోర్డులో తీర్మానం చేసినట్టు గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 294 మంది ఎమ్మెల్యేలు పంపిన సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుని వసతి కల్పించడంతోపాటు, బ్రేక్ దర్శనానికి అనుమతి ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలకు పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు.

## 'సీతారామ భూసేకరణ'ను పూర్తిచేయాలి

- ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి
- అధికారులకు నీటి పారుదల మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): సీతారామ ప్రాజెక్టుకు భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి ఉత్తమ్ చర్చించారు. సత్తుపల్లి ట్రంక్, సీతారామ ప్రాజెక్ట్ పురోగతి, భూసేకరణ, ఖర్చు, నాణ్యత, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, పంప్‌హౌస్-4 నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల్లో సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని, సీతమ్మసాగర్ బరాజ్ నిర్మాణాన్ని రాబోయే మూడేళ్లలో పూర్తిచేయాలని సూచించారు.

# కస్టడీలో నిందితుడి మృతి!

- పోలీసులు కొట్టడమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- నిజామాబాద్‌లో ప్రభుత్వ జిల్లా దవాఖాన ఎదుట ఆందోళన
- గుండె పోటుతోనే మరణించాడని పోలీస్ కమిషనర్ ప్రకటన
- మృతుడు సంపత్ శరీరంపై బలమైన గాయాలు ఉన్నాయి,
- సిట్టింగ్ జడ్జితో విచారించాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సంపత్‌ను పోలీసులే కొట్టి చంపారని ఆరోపిస్తూ నిజామాబాద్‌లోని జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, చిత్రంలో మోహరించిన పోలీసులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ)/వినాయకనగర్: నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఓ నిందితుడు గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం వివాదంగా మారింది. పోలీసులు కొట్టడంవల్లే నిందితుడు చనిపోయాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వ జిల్లా దవాఖాన ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా అంతర్గాంకు చెందిన సంపత్ (32) జగిత్యాల జిల్లాలో మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ద్వారా నిరుద్యోగులను థాయ్‌లాండ్, మయన్మార్, లావోస్ తదితర దేశాలకు పంపిచాడు. విదేశాలకు వెళ్లిన యువకులు తాము మోసపోయామని తిరిగి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిజామాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు సంపత్‌తోపాటు మరో ఏజెంట్‌పై పదిరోజుల క్రితం కేసు నమోదుచేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించింది. నిందితులను విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేయడంతో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. నిందితులను సైబర్‌క్రైమ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా గురువారం జగిత్యాలలో సంపత్ కన్సల్టెన్సీ ఆఫీసుకు తీసుకెళ్లారు. లావాదేవీలు, రికార్డులను పరిశీలించారు. రాత్రి నిజామాబాద్ సీసీఎస్‌కు తరలించారు.

### స్టేషన్ లాకప్‌లో ఏమైంది?

గురువారం రాత్రి 10 గంటలకు ఛాతిలో నొప్పిగా ఉన్నదని, చేయి లాగుతున్నదని సంపత్ తెలిపాడని పోలీసులు చెప్తున్నారు. హుటాహుటిన జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా, సంపత్ చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నిజామాబాద్‌కు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు దవాఖాన ఎదుట బైఠాయించారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతోనే సంపత్ మృతి చెందాడని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అక్కడకు చేరుకుని కుటుంబ సభ్యులతో చర్చించారు. అనుమానముంటే ఫిర్యాదు చేయాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

### సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: జాన్‌వెస్లీ

పోలీసు కస్టడీలో నిందితుడు సంపత్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వానికి జాన్‌వెస్లీ లేఖ రాశారు. పోలీసులు చిత్రహింసలు పెట్టడంతోనే అతడు చనిపోయాడని, సంపత్ శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని జాన్‌వెస్లీ చెప్పారు.

### అనారోగ్యంతోనే మృతి

పోలీస్ కస్టడీలో సంపత్ అనారోగ్యంతోనే మరణించాడని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఓ ప్రకటనలో వెల్లడించారు. దవాఖాన లోపలికి సంపత్ నడచుకుంటూ వెళ్లాడని, ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు నివేదిక అందించామని వివరించారు.

# ప్రభుత్వ కార్యాలయం నుంచి ఫైళ్ల తరలింపు

### సెలవు రోజు రాత్రి వేళ సీనియర్ అసిస్టెంట్ నిర్వాకం

ములుగు, మార్చి 14 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వ కార్యాలయం నుంచి గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయంలో ఫైళ్లను తరలించిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ములుగు పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయ కాంప్లెక్స్‌లో ఉన్న పే అండ్ అకౌంట్స్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శుక్రవారం రాత్రి తన కారులో వచ్చి అటెండర్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తుల సహాయంతో సుమారు 30కి పైగా ఫైళ్లను ఆఫీసు బయటకు తీసుకొచ్చారు. రోడ్డుపై తెల్లటి క్లాత్‌లో కట్టి కారులో ఎక్కిస్తుండగా అటుగా వెళ్లిన 'నమస్తే తెలంగాణ' ఫైళ్ల తరలింపుపై ప్రశ్నించింది. ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ సార్ ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకే కారులో పెడుతున్నట్టు అటెండర్ తెలిపాడు. సదరు అధికారి వద్దకు వెళ్లి వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, మార్చి నెలలో ఆడిటింగ్ ఉన్నందున ఫైళ్లను ములుగులోని తన గదికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. హోలీ పండుగ సెలవు రోజున, అదీ రాత్రి వేళ ఎందుకు ఫైళ్లను తరలిస్తున్నారని అడిగితే దాటవేసే ప్రయత్నం చేశారు. సంబంధిత కార్యాలయ జిల్లా అధికారి సమక్షంలో ఫైళ్లను తరలించాల్సి ఉండగా అటెండర్ సహాయంతో తరలించడం పలు అనుమానాలకు తావిస్తున్నది.



ములుగు పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ నుంచి రాత్రి 8 గంటలకు ఫైళ్లను తరలిస్తున్న అటెండర్, మరో ఇద్దరు వ్యక్తులు

## మయన్మార్ సైబర్ రాకెట్‌లో 8 మంది సభ్యుల అరెస్టు

### సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ వెల్లడి



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): మయన్మార్ సైబర్ నేరగాళ్ల ముఠాలోని మొత్తం 15 మంది ఏజెంట్లు, మధ్యవర్తుల్లో 8 మందిని అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిగిలినవారు పరారీలో ఉన్నారని, వారిలో ఐదుగురు విదేశాల్లో ఉన్నారని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా 10 మంది బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ముఠాపై 9 కేసులు నమోదైనట్టు తెలిపారు.

# చేనేతలకు లక్షలోపే రుణమాఫీ!

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తున్నామని, అందుకోసం రూ.33 కోట్లు విడుదల చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభలో పాల్గొన్న ఆయన, ఈ మేరకు ప్రకటన చేసిన విషయం తెలిసిందే. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్యకాలంలో రుణం పొందిన వారికి మాత్రమే మాఫీ జరిగినట్టు జీవోలో పేర్కొన్నారు. దీంతో చేనేత, పవర్‌లూమ్ కార్మికుల్లో కలవరం మొదలైంది. రూ.లక్షలోపు వారికి మాత్రమే రుణమాఫీ చేస్తే, లక్ష దాటిన వారి పరిస్థితి ఏమిటని సర్కారును నిలదీస్తున్నారు. రూ.లక్షకు ఒక్క రూపాయి ఎక్కువైనా రుణమాఫీ చేయడం లేదని చేనేత కార్మిక సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకర్లు కూడా ఇదే విషయం చెబుతున్నట్టు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 వేల మందికిపైగా చేనేత కార్మికులు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోగా, అధికారంలోకి రాగానే రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలల పాటు ఆలస్యం చేసింది. దీంతో బ్యాంకుల ఒత్తిడికి కొంతమంది చేనేత కార్మికులు తలొగ్గి బయట అప్పులు చేసి రుణాలు తీర్చారు. ఇక మిగిలిన వారికి మాత్రమే ఇప్పుడు రుణమాఫీ వర్తిస్తున్నట్టు చెబుతుండడంతో రుణాలు చెల్లించిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అసలు రుణమాఫీ బ్యాంకుల నుంచి పొందిన అసలుకా? వడ్డీతో కలిపి మొత్తానికి చేస్తారా అనేది తెలియాల్సి ఉందని పేర్కొంటున్నారు. రుణమాఫీకి సంబంధించిన అంశాలపై క్లారిటీ ఇవ్వాలని, అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు స్వామి, పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేస్తున్నారు.

# జూలైలో పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

- నేటికీ కొలిక్కిరాని బీసీలకు 42 శాతం రిజర్వేషన్
- 2024 ఫిబ్రవరి 1న ముగిసిన పాలకవర్గాల గడువు
- నిబంధనల ప్రకారం ఇప్పటికే 14 నెలలు ఆలస్యం
- సకాలంలో ఎన్నికలు జరుగక నిలిచిన కేంద్ర నిధులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జూలైలో అయినా జరుగుతాయా అనే అనుమానం కలుగుతున్నది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 15 నెలలైనా రిజర్వేషన్ల ప్రక్రియను రేవంత్ సర్కారు కొలిక్కి తీసుకురాలేకపోయింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన వివిధ అభివృద్ధి నిధులు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ సంక్షేమానికి తీవ్ర విఘాతం కలుగుతున్నది.

### గ్రామాల్లో నిధుల కొరత..

రాష్ట్రంలో గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. నిరుడు ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ఆర్టికల్ 243ఈ(3)ప్రకారం.. ప్రతి ఐదేండ్లకు ఒకసారి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. గ్రామపంచాయతీ పాలకవర్గం గడువు ముగిసేలోపు లేదా పాలకవర్గం రద్దయిన ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తిచేయాలి. కానీ, గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి 14 నెలలు కావస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంపై కేంద్ర పంచాయతీరాజ్ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజాగా ఆందోళన వ్యక్తంచేసింది. ఎన్నికల ఆలస్యంతో గ్రామాభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు నిలిచిపోయాయని తెలిపింది.

### బీసీల రిజర్వేషన్‌పై మల్లగుల్లాలు

కులగణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకటించింది. ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల సర్వే నిర్వహించింది. గణాంకాలను అసెంబ్లీలో ప్రకటించింది. 3.1 శాతం(16 లక్షల) జనాభా సర్వేలో పాల్గొనలేదని వెల్లడించింది. సర్వే గణాంకాలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, మేధావులు తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. రీ సర్వేకు డిమాండ్ చేశారు. దీంతో సర్కారు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మళ్లీ కులగణన వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. 15 వేల లోపు కుటుంబాల వివరాలు మాత్రమే సేకరించగలిగింది. ఈ గణాంకాలపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అప్పుడే 42 శాతం రిజర్వేషన్లపై బిల్లు పెడతామని, పార్లమెంట్‌లో ఆమోదం కోసం పంపిస్తామని చేతులు దులుపుకున్నది.

# వెయ్యేళ్ల బాసర శిల్పాలను పరిరక్షించాలి



పాపహరేశ్వర ఆలయం వద్ద పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

బాసర, మార్చి 14 : చదువుల తల్లి సరస్వతీ అమ్మవారు కొలువైన బాసరలో ఉన్న వేయి ఏళ్ల శిల్పాలను పరిరక్షించాలని పురావస్తు పరిశోధనకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. బాసరలోని పాపహరేశ్వర స్వామి ఆలయం ముందు వేయి ఏళ్ల నాటి శిల్పాలు ఆదరణ లేక నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని అన్నారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు, స్థానిక చరిత్రకారులు బలగం రాంమోహన్ ఇచ్చిన సమాచారం మేరకు తాను ఇక్కడికి చేరుకొని శుక్రవారం చారిత్రక ఆనవాళ్లు, శిథిలాలయాలు, శాసనాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయం ముందు క్రీ.శ 11వ శతాబ్దం జైన శాసనాన్ని, గణేశాలయంలో క్రీ.శ 8శతాబ్ది నాటికి 5అడుగుల ఎత్తున బాదామి చాళుక్య గణేశ శిల్పం చారిత్రక ప్రాధాన్యత గలవని, పాపహరేశ్వరాలయం ముందున్న క్రీ.శ 9, 12 శతాబ్దిలకు చెందిన జైన యక్షిణి, భైరవ, లింగం, నంది, గణేశ, సతిశిలలు, దాన శాసనాలు, విరిగిన శిలతోరణాలను భద్రపరిచి భావితరాలకు అందించాలన్నారు. వీరితో బలగం రాంమోహన్, శిల్పులు, బీ సుధాకర్‌సింగ్, ధర్మేంద్రకిరణ్, మోతీలాల్ పాల్గొన్నారు.

# ఎండల జోరు.. యువకుల హోరు

*కెరమెరి, మార్చి 14: మార్చిలోనే ఎండలు దంచి కొడుతున్నాయ్.. ఈ నేపథ్యంలో హోలీ పండుగ వచ్చింది. కొందరూ ఆటపాటల్లో.. మరికొందరు విందు, వినోదాల్లో నిమాగ్నమయ్యారు. వీటన్నింటికి దూరంగా ఉన్న యువకులు మాత్రం మండుతున్న ఎండల్లో వాగుబాట పట్టారు. కెరమెరికి సమీపంలో ఉన్న వాగులో యువకులు నీటి విన్యాసాలు చేస్తుండగా 'నమస్తే' క్లిక్‌మనిపించింది.*



వాగులో విన్యాసాలు చేస్తున్న యువకులు

## ఇసుక తరలిస్తే చర్యలు

జైనూర్, మార్చి 14: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సాగర్ హెచ్చరించారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండల తుంపల్లి గ్రామానికి చెందిన తాజ్ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, తాజ్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.





సాకెర గ్రామ శివారులో ఏర్పాటు చేసిన తెలంగాణ దశాబ్ది సంపద వనాలు



ఎదుగుదల లోపించి ఉన్న వివిధ రకాల పండ్ల మొక్కలు

# ఎదుగుదలపై పట్టింపేది.?

- రెండేళ్లైనా ఎదుగుదల అంతంతే
- 'సంపద వనాలపై' అధికారుల నిర్లక్ష్యం

సోన్, మార్చి 14: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ దశాబ్ది సంపద వనాలు' ప్రస్తుతం నిర్వీర్యమవుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ చేపట్టిన దశాబ్ది సంపద వనాలు ప్రస్తుతం వాడిపోయి దర్శనమిస్తున్నాయి. సోన్ మండలంలోని శాకెర గ్రామ సమీపంలో గల సరస్వతి కెనాల్ తీర ప్రాంతంలో లక్షలాది రూపాయలతో వెచ్చించి ఏర్పాటు చేసిన దశాబ్ది సంపద వనాలు ఎదుగుదల లేక ఏడారిని తలపిస్తోంది. ఘనంగా లక్ష్యం కోసం ప్రారంభించిన సంపద వనాలు అధికారుల నిర్లక్ష్యంతో సరైన నిర్వహణ లేక మొక్కలు ఎదుగుదల లేక ప్రస్తుతం మొక్కలుగానే దర్శనమిస్తున్నాయి. ఎదుగుదలకు సరిపడా ఎరువులు, ఖనిజ లవణాలు సరైన సమయంలో అందించకపోవడం ప్రధాన లోపంగా తెలుస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన మండల స్థాయి అధికారులు సైతం పర్యవేక్షణ లోపించినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్యం ఘనంగా ఉన్నా ఆచరణలో మాత్రం లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. దాదాపు 5.85 లక్షల మేర అంచనా విలువతో ఏర్పాటు చేసిన సాకెర దశాబ్ది సంపద వనాలు ఇలా నిర్వీర్యమవుతున్నా దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంపద వనాలను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారగణం పట్టింపు లోపించినట్లు స్పష్టమవుతోంది.

### లక్ష్యం ఘనం... ఆచరణ శూన్యం..

ఇక్కడ కనిపిస్తున్న మొక్కలు ఇటీవల నాటినవి అనుకుంటే పొరబడినట్లే. రెండేళ్లకు పైగా కావస్తున్నా ఇప్పటికి నాటిన మొక్కలు నాటినట్లే దర్శనమిస్తున్నాయి. వీటికి సరైన సమయంలో నీరు, ఎరువులు, పోషక పదార్థాలు అందించకపోవడం వల్లనే ఎదుగుదల లోపించినట్లు తెలుస్తోంది. స్థానిక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన సరస్వతి కెనాల్ సాకెర గ్రామ పంచాయతీ సరిహద్దులో నుంచి వెళ్తుండగా ఇక్కడ దశాబ్ది సంపద వనాలను ఏర్పాటు చేస్తూ ప్రయోజనం చేకూరుతోందని భావించిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘనమైన లక్ష్యంతో సంపద వనాల ఏర్పాటుకు పూనుకోగా అంచనా వ్యయం 5.85 లక్షలను కేటాయించింది. కాగా రెండు ఎకరాల విస్తీర్ణంలో 2023 జూన్‌లో ప్రారంభించిన మొక్కల పెంపకం ఇప్పటికీ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న' చందంగా కన్పిస్తోంది. డీఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లనే ఆచరణ సరైన విధంగా అమలు కాలేకపోతోందని తెలుస్తోంది.

### పండ్ల మొక్కల పెంపకంతో ప్రయోజనం ఉంటుందని భావించి...

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వివిధ రకాల పండ్ల మొక్కలను ఉపాధి హామీ పథకం కింద పెంచి గ్రామానికి ఆదాయం సమకూర్చాలనే సమున్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంపద వనాలు ప్రస్తుతం అస్తవ్యస్థంగా మారడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండ్ల మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహించే సదుద్దేశ్యంతో జామ, సీతఫల్, నిమ్మ, తదితర వంటి పండ్ల మొక్కల పెంపకానికి పునుకొని సంపద వనాలను ఏర్పాటు చేయగా ప్రస్తుతం ఆ వనాలన్ని ఏడారిని తలపిస్తున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 2023 సంవత్సరంలో 1260 వివిధ రకాల పండ్ల మొక్కలను నాటి దాదాపు రెండేళ్లకు పైగా కావస్తున్నా ఇప్పటికే మొక్కల ఎదుగుదల సరైన విధంగా లేకపోవడం గమనార్హం. సాధారణంగా ఏ పండ్ల మొక్కలు నాటినా ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంలో కాతకు వచ్చే అవకాశం ఉంటుంది. కాని ఇక్కడి ఉపాధి హామీ గ్రామ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్ల ఇప్పటికీ మొక్కలు ఎదుగుదల లేకుండా నాటిన మొక్కలుగానే ఉన్నట్లుగా ఉన్నాయి. పూత, కాత వంటివి లేకుండా నాటిన మొక్కలు అలాగే ఉండిపోవడం పట్ల ఆశించిన ప్రయోజనం చేకూరకపోతుంది.

## ఎంఈవో కార్యాలయమేనా....?



సోన్, మార్చి 14: నిర్మల్‌లోని దివ్యనగర్‌లో గల మండల ఎడ్యుకేషన్ కార్యాలయం ముందు కొద్ది రోజుల నుంచి శుభ్రం చేయకపోవడంతో కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయమేనా ?... ఇక్కడ నిర్మల్ అర్బన్ ఎంఈవో కార్యాలయంతో పాటు నిర్మల్ రూరల్ ఎంఈవో కార్యాలయాలు రెండు ఒకేచోట ఉండడం గమనార్హం. ప్రతి రోజూ కార్యాలయాన్ని శుభ్రం చేయించాల్సిన అవసరం ఎంతైన ఉందని కార్యాలయానికి వచ్చిపోయే ఉద్యోగులు పేర్కొంటున్నారు.

## వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ

కన్నెపల్లి, మార్చి 14: మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని బోయ వాల్మీకి సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ సంఘం అధ్యక్షుడు పల్ల వెంకటి, ఉపాధ్యక్షుడు నారాయణ, కోశాధికారి పోచయ్య, పున్నం, తదితరులు ఉన్నారు.




## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 14: ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో 7వ తరగతికి చెందిన దుర్గం సిద్ధార్థ, దాగం శోభిత్ ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి, వనపర్తి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లూరి వామన్, పీడీ ముచ్చకుర్తి రాజశేఖర్, ఉపాధ్యాయులు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎం రమేశ్, ఏ ప్రేమలత, వీ శశికుమార్ అభినందించారు.

## గొల్లపల్లిలో మంటలు



గొల్లపల్లిలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నెన్నెల, మార్చి14: గొల్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ శుక్రవారం మధ్యాహ్నం ఒర్రె పక్కన ఉన్న చెట్లపొదలకు మంటలు అంటుకుని వ్యాపించాయి. గమనించిన కాలనీ ప్రజలు బెల్లంపల్లి ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు ఎస్ఐ ప్రసాద్, స్థానికుల సాయంతో మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



రిషికుమార్(ఫైల్)

ఎదులాపురం, మార్చి 14 : హోలీ పండుగ వేళ ఆదిలాబాద్‌లో విషాదం జరిగింది. శుక్రవారం పట్టణంలోని కుమ్మరివాడకు చెందిన జిల్లెడ్వార్ రిషికుమార్(16) బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడడంతో మృతి చెందాడు. అప్పటి వరకు ఇంటి వద్ద స్నేహితులు ఆమ్లే ప్రేమ్, బడేన్‌వార్‌తో కలిసి హోలీ ఆడుకున్నాడు. అనంతరం ముగ్గురు కలిసి అశ్విన్‌ను కచ్‌కంటి గ్రామ రోడ్డు వద్ద దింపివేసి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ నడుపుతున్న రిషికుమార్ ఎరోడ్రం దాటిన తర్వాత కుమ్మరికుంట వద్ద అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో మెయిన్‌రోడ్డు మలుపువద్ద పడిపోయింది. వారిని 108లో రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే రిషికుమార్ మృతి చెందాడు. ఇద్దరు విద్యార్థులు పట్టణంలోని సేవాదాస్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థి చనిపోవడంతో తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి తండ్రి జెఊశన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.